www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 9 మార్చి 2025
5
వైఎస్ఆర్



మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అట్లూరు : వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12న విజయవాడలో నిర్వహించబోయే మహాధర్నాను విజయవంతం చేయాలని మండల నాయకులు బి. నర్సు, బి. లలిత పిలుపునిచ్చారు. మండలంలోని దేవ నగర్లో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు కోట్ల మంది పేదలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని, వారికి సొంత ఆస్తులు లేక చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు లేక, పొట్టకూటి కోసం ఏ పని దొరికితే ఆ పనికి డిగ్రీ పీజీ చదువుకున్న వెళ్తున్నారని చెప్పారు. విద్యావంతులు ఉపాధి కూలీ పనులకు వెళ్తున్నారని, పనుల్లో కూడా పోటీ పెరిగి చేతినిండా పని దొరక సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని వారు అన్నారు. వ్యవసాయ రంగంలో కూలీపని చేసుకుని జీవిద్దాం అన్నా పని దొరకడం లేదని పేర్కొన్నారు. మన హక్కుల సాధన కోసం పేదలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.

ఎంఎస్ఎంఇలపై బాదుడుకు కసరత్తు

పాలసీ రూపకల్పన పేరుతో సర్వే

నాలుగు నెలలూ అరకొరే | **54 శాతం దాటని వైనం**

మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఇ) సర్వే పేరుతో పన్ను బాదుడుకు రంగం సిద్ధమవుతోంది. ప్రభుత్వం నూతన పాలసీల రూపకల్పన పేరుతో సర్వే చేయాలని కోరుతూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా అధికార యంత్రాంగం నాలుగు నెలల కిందట నుంచి జిల్లాలోని సచివాలయాల వారీగా సర్వేకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని ఎంఎస్ఎంఇల సర్వే బృందాలకు పరిశ్రమల నిర్వాహకులు సర్కారు లోగుట్టును గ్రహించి సహకరించని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఈ నెల 15 నాటికి సర్వే గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో 54 శాతం సర్వేను సైతం పూర్తి చేయలేని పరిస్థితి కనిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 79,245 ఎంఎస్ఎంఇ పరిశ్రమలున్నాయి. మైక్రో, స్మాల్, మీడియం, లార్జ్ కేటగిరీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,01,172 మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం నూతన పాలసీ రూపకల్పన పేరుతో ఖజానా నింపుకోవడంపై దృష్టి సారించింది. ఎంఎస్ఎంఇల ఆర్థిక కార్యకలాపాల ఆధారంగా 18 శాతం నుంచి జిఎస్‌టి బాదుడుకు రంగం సిద్ధం చేసిందనే వాదనవినిపిస్తోంది. మైక్రో ఎంఎస్ఎంఇ ఆర్థిక లావాదేవీలు రూ.ఐదు కోట్లు, స్మాల్ ఎంఎస్ఎంఇల లావాదేవీలు రూ.ఐదు కోట్ల నుంచి 50 కోట్లు, మీడియం ఎంఎస్ఎంఇల లావాదేవీలు రూ.50 కోట్ల నుంచి రూ. 250 కోట్లు, అంతకు మించి ఆర్థిక లావాదేవీలు సాగించిన లార్జ్ ఎంఎస్ఎంఇలపై జిఎస్‌టి భారం పడే అవకాశాలు ఉన్నాయనే వాద న వినిపిస్తోంది.



సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

సచివాలయాల వారీగా సర్వే

జిల్లాలోని 645 సచివాలయాల వారీగా సర్వే ఊపందుకుంది. ప్రతిరోజూ 3,304 ఎంఎస్ఎంఇలను సర్వే చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలిస్తే లక్ష్యానికి, ఆచరణకు పొంతన కుదరడం లేదు. 2024 నవంబర్ నుంచి 2025 మార్చి 15 నాటికి జిల్లాలోని 79,245 ఎంఎస్ఎంఇల సర్వే ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ప్రభుత్వ పాలసీల రూపకల్పన వెనుక గల ఆంతర్యాన్ని గమనించిన ఎంఎస్ఎంఇల యాజమాన్యాలు సహకరించని పరిస్థితి కనిపిస్తోంది.

జిఎస్‌టి గుప్పిట్లో...

జిల్లాలోని ఎంఎస్ఎంఇ నిర్వాహకులను జిఎస్‌టి భయం కలవరాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వం నూతన పాలసీ రూపకల్పన పేరుతో చేపట్టిన సర్వేపై ఎంఎస్ఎంఇ నిర్వాహకుల్లో ఆందోళన నెలకొంది. సర్వే ఆశించిన విధంగా ముందుకు సాగడంలేదు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు పట్టణాల్లో ఎంఎస్ఎంఇ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. ప్రొద్దుటూరు పట్టణంలో గణనీయమైన సంఖ్యలో ఉన్నాయి. ఇప్పటి ఎంఎస్ఎంఇలపై సర్వే వే డిజ్ రూ. ఐదు కోట్లు దాటిన వ్యాపార కార్యకలాపాల్ని జిఎస్‌టి పరిధిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఎంఎస్ఎంఇ నిర్వాహకులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

నాలుగు నెలలు..54 శాతం!

జిల్లాలోని ఎంఎస్ఎంఇల సర్వే 54 శాతానికి పరిమితమైంది. 2024 నవంబర్ నుంచి 2025 మార్చి నాలుగవ తేదీ నాటికి నాలుగు నెలల వ్యవధిలో 43,117 ఎంఎస్ఎంఇల సర్వే మాత్రమే పూర్తి చేసింది. 2025 మార్చి 15 నాటికి సర్వే గడువు ముగియనుంది. మిగిలిన 10 రోజుల వ్యవధిలో మిగిలిన 36,173 ఎంఎస్ఎంఇల్లో ఎన్నింటి సర్వే పూర్తి చేయనుంది. ఎప్పటికి పూర్తి స్థాయిలో సర్వే ప్రక్రియ పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత

ప్రజాశక్తి - కడప అర్బన్

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బిసి సంక్షేమం, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్. సవిత అన్నారు. శనివారం స్థానిక సాయి శ్రీనివాస్ గార్డెన్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లోనూ సత్తా చాటుతున్నారని, క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకు పోతున్నారని పేర్కొన్నారు. వ్యాపార రంగాల్లోనే కాదు సమాజ సేవలోనూ, రాజకీయ రంగంలోనూ మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళను వ్యాపారవేత్తగా చేయాలన్న లక్ష్యంతో ఎంఎస్ఎంఇ యూనిట్లు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేశారన్నారు. ఈ ఏడాది లక్షమంది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్నామన్నారు. లక్ష మందికి పైగా మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్నామన్నారు. పురుషులతో పోల్చుకుంటే మహిళల్లో ఓపిక ఎక్కువని చెప్పారు. . మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి డ్వాక్రా సంఘాలను స్థాపించి నేడు వారిని లక్షాధికారులను చేశారన్నారు. అనంతపురం జిల్లా పెనుకొండకు ఎమ్మెల్యే కావాలని తన అమ్మ కోరిక అని ఎన్నో అడ్డంకులను అధిగమించి నేడు మంత్రి స్థాయికి ఎదగగలిగానని ఆమె అన్నారు. కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండాఅన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. గతంలో రూ.600 కోట్ల నుంచి 650 కోట్లు రుణాలు ఇచ్చేవారమని, ప్రస్తుతం బ్యాంకుల ద్వారా రూ1500 కోట్ల రుణాలు ఇస్తున్నామని, ఇది మహిళల అభివృద్ధికి నిదర్శనం అన్నారు. ఎంతో ఆర్థికంగా అభివృద్ధి చెందినా ఆడబిడ్డలను ఇంకా సమాజంలో చిన్నచూపు చూడడం సరికాదన్నారు. ఎస్‌పి అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎంతోమంది మహిళా మణులున్నారని, వారందరిని స్ఫూర్తిగా తీసుకొని ఎడగాలన్నారు. మహిళలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ మహిళలు స్వాలంబన స్వయంగా సాధించుకోవాలని అన్నారు. మహిళ అభివృద్ధి కి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని వినియోగించుకొని సామాజికంగా, ఆర్థికంగా సమాజంలో ఎదగాలని తెలిపారు. కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి రెడ్డి మాట్లాడుతూ మహిళలు బహుముఖ ప్రజ్ఞాశాలులని అన్ని పనులు చేసుకోగలరని అన్నారు. మహిళా అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి మహిళలకు అవకాశం కల్పించడం జరుగుతోందని అన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన మహిళా అధికారులను, ఉద్యోగులను జ్ఞాపికలతో సత్కరించారు. అర్హులకు బ్యాంకు లింకేజీ రుణాలు, నలుగురు ఉత్తమ మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రేరణసఖి ద్వారా ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున మెగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి ఐసిడిఎస్, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు శ్రీలక్ష్మి, ఆనంద్‌నాయక్, కిరణ్‌కుమార్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి రాజ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

బిసిలను బలోపేతం చేయాలి : మంత్రి

కడప : జిల్లాలో వెనుకబడిన తరగతుల వర్గాలను బలోపేతం చేసి ముందుకు నడిపించాలని రాష్ట్ర వెనుకబడిన తరగతులు, బలహీన వర్గాల సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బిలో బిసి సంక్షేమ శాఖాధికారులు, ఎంజెపి విద్యాలయాల ప్రిన్సిపాళ్లు, చేనేత జౌళిశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఎంజెపి పాఠశాలలో చిన్న చిన్న మరమ్మతులకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి నిధులు సమీకరించాలన్నారు. త్వరలో ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను ఏవిధంగా సమయాత్తం చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందుకుంటున్న లబ్ధిదారులు యూనిట్ల స్థాపనకు తీసుకుంటున్న చర్యలు, ఆ వివరాలపై సంబందిత అధికారులతో మంత్రి సమీక్షించారు. వచ్చే ఏడాది నుంచి అన్ని సంక్షేమ హాస్టళ్లలోనూ సన్న బియ్యంతో వండిన భోజనాన్నే విద్యార్థులకు వండి పెట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో టిడిపి పొలిటీబ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులు రెడ్డి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి భరత్ రెడ్డి, హ్యాండ్ లూమ్స్ డెవలప్‌మెంట్ అధికారి అహ్మద్, బిసి సంక్షేమ హాస్టళ్ల వేల్ఫేర్ అధికారులు, ఎంజెపి ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 6,053 కేసులు పరిష్కారం

- రూ.15.58 కోట్లు కక్షిదారులకు చెల్లింపు



కక్షిదారులకు చెక్కును అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా 16 బెంచీలు ఏర్పాటు చేసి నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సాయంత్రం ఏడు గంటల వరకు అందిన సమాచారం మేరకు 6,053 కేసులను రాజీ ద్వారా పరిష్కరించి కక్షిదారులకు రూ.15,58, 91,342 చెల్లించారు. జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ సభ్యులు, కక్షిదారులు వారి వారి న్యాయవాదులతో సంప్రదింపులు చేసి కేసులను పరిష్కరించుకున్నారు. మొదటి అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో ఉన్న ఎంవిఒపి నంబర్ 98/2017 కేసులో రూ. 23 లక్షలు మొత్తానికి వాది అయిన సయ్యద్ నీలోఫర్, ఇతరులు, ప్రతివాది అయిన హెచ్‌డిఎఫ్‌సి జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వారు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అయ్యారు. ఈ కేసులో వాది తరపున న్యాయవాది వై. ప్రసాద్, ప్రతి వాది తరపున న్యాయవాది డి.రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దినబాబు,, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జిసి.ఆసిఫా సుల్తానా, ఎక్సైజ్ కోర్టు జడ్జి జె.హేమ స్రవంతి, మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం.ఆశాప్రియ, కడప బార్ అసోసియేషన్ బార్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాంతమ్మ

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ మహిళా చైర్మన్ అధ్యక్షులు శాంతమ్మ పేర్కొన్నారు. ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్‌యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, ఉమెన్ వింగ్ కన్వీనర్ భారతి, రాష్ట్ర ఉమెన్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నిర్మల జ్యోతి, ప్రత్యేక ఆహ్వానితులుగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.రాజ్య లక్ష్మి, ఎస్ సి కార్పొరేషన్ రోజా రాణి, ప్రిన్సిపల్ వై. జయలక్ష్మి, ట్రైనింగ్ స్కూల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ జిల్లా చైర్మన్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలని పేర్కొన్నారు. ప్రతి మహిళా విద్యావంతులు కావాలన్నారు. కన్వీనర్ విజయ భారతి మాట్లాడుతూ ఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడ పోటీలు నిర్వహించమన్నారు. జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలకు ప్రసూతి సెలవులు మంజూరు చేసిన ప్రభుత్వానికి మహిళలు విద్యా, ఉద్యోగ, రాజకీయ, సేవా కార్యక్రమాల్లో పోటీ పడి అన్నిరంగాల్లో ఉన్నారని చెప్పారు. ఆటల పోటీలు లెమన్ స్పూన్, టేనికట్, త్రోబాల్, కబడ్డీ, వాలీబాల్, డిస్కత్రో, జావిల్లిన్ త్రో, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్ పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేసారు. కార్యక్రమంలో జ్యోతి, ప్రమీల్ల, పద్మ, శాంతి, సుహాసిని, లక్ష్మి, కృష్ణ కుమారి, ప్రసనలత, ఎ.కె. పద్మజ, జిల్లా నాయకులు నిత్య పూజయ్య, తిమ్మారెడ్డి, టి.శ్రీనివాసులు, రాజశేఖర్, వాసన్, నరసింహారెడ్డి, సిటీ అధ్యక్షులు చిన్నయ్య, నాగార్జున, పద్మనాభం, ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

రేపు ఉచిత గ్రహణ మొర్రి పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

బసవతారకం స్మైల్ ట్రైన్ సెంటర్-బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కడప నగరంలోని భవిత సెంటర్‌లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకు ఉచిత గ్రహణ మొర్రి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి నిత్యానంద రాజు, సహిత విద్యా సమన్వయకర్త రమణమూర్తి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పరీక్షలు డాక్టర్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత గ్రహణ మొర్రి (పెదవి చిలుక, అంగిలి చిలుక) స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 6 నెలల వయస్సు నుంచి 50 సంవత్సరాలు వారు శిబిరానికి హాజరు కావాలని తెలిపారు. గ్రహణ మొర్రి ఆపరేషన్ జరిగిన వారు, గ్రహణ మొర్రి ఆపరేషన్ చేసుకొని వారు కూడా ఈ శిబిరానికి హాజరు కావాలని పేర్కొన్నారు. అవకాశాన్ని జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని తెలిపారు.



హోం మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సలావుద్దీన్

సమస్యను సామరస్యంగా పరిష్కరించండి

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్నమయ్య జిల్లా రాయచోటిలో చోటు చేసుకున్న ఘటనపై ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ ఆధ్వర్యంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, మైనార్టీ మంత్రి ఫరూక్, ఐజి, ఏపీ ఇండస్ట్రీయల్ చైర్మన్ మంతెన రామరాజును కలిసి వినతిపత్రాలు సమర్పించారు. మత సామరస్యానికి భంగం కలిగించేలా కొన్ని దుష్టశక్తులు గొడవలు సృష్టించాలని చూస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి గొడవలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. రాయచోటిలో ఇరు వర్గాలను పిలిపించి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి హాజీ అబ్దుల్ కలాం, ఉపాధ్యక్షులు మౌల బేగ్, మహిళా అధ్యక్షులు సయ్యద్ మెహతాజ్ భేగం, అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మన్సూర్ అలీఖాన్, రాయలసీమ ఇన్‌ఛార్జి షేర్ అలీ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎవిఆర్ చైర్మన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించాలని బవిఆర్ విద్యా సంస్థల చైర్మన్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం ఎస్‌బటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య విజ్ఞానాన్ని పెంచుతుందని, పోటీ పరీక్షలు రాయడం ద్వారా విద్యార్థుల సామర్థ్యం బయటపడుతుందని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ వీర కుమారి, ఎఎల్ వివేకానంద, పల్లవి, ప్రిన్సిపల్ ముని చంద్ర, నరసింహులు, క్యాంపస్ ఇన్‌ఛార్జి బాబా ఫక్రుద్దీన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

'యువత పోరు'కు తరలిరండి : వైసిపి

ప్రజాశక్తి - కడప

ఈనెల 12న వైసిపి నిర్వహించబోయే 'యువత పోరు' కార్యక్రమానికి యువత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. అదే రోజు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. శనివారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిఎంగా ఉండేందుకు చంద్రబాబు నాయుడు అనర్హుడని అన్నారు. వెన్నుపోటు పొడవడం, ఇచ్చిన మాట తప్పడం చంద్రబాబు నైజం అని వారు అన్నారు. ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థుల పక్షాన వైసిపి నిలబడి పోరాటాలు సాగిస్తుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో యువతకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రతి ఒకరికి సమ న్యాయం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. సమావేశంలో కడప నగర మేయర్ కె. సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామ చంద్రారెడ్డి, రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య యాదవ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు దేవి రెడ్డి ఆదిత్య, జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షులు గురు సాయి దత్త, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రరెడ్డి, నగర విద్యార్థి విభాగం అధ్యక్షుడు శివారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - కడప

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెంచడానికి మైనారిటీ జిల్లా అధ్యక్షులు రహమతుల్లా ఖాన్ సిద్ధం చేసిన పోస్టర్లను శనివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి విడుదల చేశారు. పోస్టర్ విడుదల సందర్భంగా వక్ఫ్ చట్ట సవరణ వల్ల మైనారిటీ హక్కులు హరించబడుతున్నాయని, దీని వెనుక ఉన్న గోప్య లక్ష్యాలను ప్రజలు గుర్తించి నిరసన వ్యక్తం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిటీ అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్, మైనార్టీ క్రిస్టియన్ జిల్లా అధ్యక్షులు పీడీ సంజయ్ కాంత, తులసి, సుబ్బమ్మ, సంతోషమ్మ, మామిళ్ళ బాబు, అబ్దుల్ సత్తార్, మల్లెం విజయభాస్కర్, కదిరి ప్రసాద్ గౌడ్, రఫీఖ్ ఖాన్, సయ్యద్ గౌస్ పీర్, సిరాజుద్దీన్, ముబారక్, చిన్న కుల్లాయప్ప, ఆసిఫ్ ఖాన్, కమల్ భాష, హమీద్ ఖాన్, రాహంతుల్లా ఖాన్, శీలం గంగయ్య, జహూర్ పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా ఐక్యత చాటాలి

ప్రజాశక్తి- గోపవరం

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గ స్థాయిలో ఐక్యత చాటాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు భాస్కర్, నేషనల్ ఉమెన్‌రైట్స్ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మడకలవారిపల్లిలోని మాలమహానాడు కార్యాలయంలో బద్వేల్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి మురళి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరమెంతైనా ఉందని పిలుపునిచ్చారు. అనంతరం బద్వేల్ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షులుగా వంకెల సుబ్బ రాయుడు, ప్రధాన కార్యదర్శిగా దాసరి కృష్ణ, బద్వేల్ మండల రూరల్ అధ్యక్షులుగా మధ్యల సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ఐవారయ్య, గోపవరం మండల అధ్యక్షులుగా కసిరెడ్డి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా మెడమల వెంకటరమణ, అట్లూరు మండల అధ్యక్షులుగా మద్దెల చిన్న గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా వాన రాశి నారాయణ, ఎన్నుకున్నారు.

కామ్రీ టయోటా కారు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని బుడ్డాయ పల్లె వద్ద ఉన్న టయోటా షోరూంలో కామ్రీ టయోటా కారును ఎంఎల్‌ఎ, ప్రభుత్వ విప్ మాధవి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివసరెడ్డి, షోరూం ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్ల నాణ్యతలో రాజీపడొద్దు : మంత్రి

ప్రజాశక్తి - కడప



మంత్రిని సన్మానిస్తున్న ఆర్అండ్‌బి అధికారులు

రోడ్ల అభివృద్ధిలో, నాణ్యతలో ఎక్కడా రాజీకి పడొద్దని, అధికారులు చిత్తశుద్ధితో పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్ అండ్‌బి శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా పర్యటనలో భాగంగా శని వారం కడప జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డికి స్థానిక ఆర్అండ్‌బిలో అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛ అందించి శాలువాతో సత్కరించారు. జిల్లా ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు ఈ సందర్భంగా జిల్లాలో రోడ్ల అభివృద్ధి పనులు, గుంతల రహిత రోడ్ల మరమ్మతులు పనులుపై మంత్రి అధికారులతో ఆరా తీశారు. జిల్లా పరిధిలో గుంతల రహిత రోడ్ల కార్యక్రమంలో భాగంగా 219 పనులు గాను రూ. 35 కోట్లు కేటాయించగా, 97 శాతం పనులు ఇప్పటి వరకు పూర్తి చేసినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొ చ్చారు. కడప బైపాస్‌కు 14 కిలోమీటర్లు గుంతలు పూడ్చడానికి ఒప్పందం పూర్తయినట్లు, త్వరలోనే పనులు ప్రారంభించి 10 రోజుల్లో పూర్తి చేస్తామని అధి కారులు తెలియజేశారు. ఇర్‌ఖాన్ సర్కిల్ నుండి ఊటుకూరు వరకు 6 కిలో మీటర్లు గుంతలు పుడ్చే పనులు ప్రారంభించినట్లు తెలియజేశారు.

మృత్యుఘోష

ప్రజాదృష్టి

జిల్లాలో రోడ్డు ప్రమాదాల పరంపరం కొనసాగుతోంది. గత బుధ వారం గువ్వల చెరువుఘాట్, దువ్వూరు, కొండాపురం మండలాల్లో చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఐదుగురు మృత్యు వాతపడడం ఆందోళన కలిగిస్తోంది. గువ్వలచెరువు ఘాట్ మృత్యువుకు కేరాఫ్ అడ్రెస్‌గా మారింది. ప్రతి ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏకరువు పెట్టడం మినహా ఆచరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల మిన్నకుండిపోవడం, ఫలితంగా మరుసటి రోజు నుంచే ఒక్కడో ఒకచోట ప్రమాదాలు చోటుచేసుకోవడం పరిపాటిగా మారింది. కడప, అన్నమయ్య జిల్లాల సరిహద్దు ప్రాంతమైన గువ్వలచెరువు ఘాట్ మీదుగా లాజిస్టిక్స్ వాహనాలను రాత్రిపూట వెళ్లడానికి డ్రైవర్లకు మత్తు పరీక్షల నిర్వహణ సహా డ్రైవర్ ఎన్ని కిలోమీటర్ల నుంచి డ్రైవింగ్ చేస్తున్నాడనే అంశాలను పరిశీలించడం, సంబంధిత నిపు ణులు సలహాలు తీసుకుని అమలును పరిశీలిస్తే ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుం దేమో ఆలోచించాలి. కడప జిల్లాలోని గువ్వలచెరువు, పులివెందుల, కదిరి, అన్నమయ్య జిల్లా రాపూర్ తదితర ఘాట్లలోని ఆయా మలుపుల దగ్గర పడి పోయిన రక్షణ గోడల పునరుద్ధరణ, బలమైన సిమెంట్ కాంక్రీట్ గోడలను నిర్మించాల్సిన ఆవశ్యకతను గ్రహించాల్సి ఉంది. లాజిస్టిక్ వాహనాలు సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణిస్తున్న నేపథ్యంలో బైక్‌లపై వెళ్లాలంటే మృత్యువుకు సిద్ధపడి ప్రయాణించాల్సిన దుస్థితి దాపురించింది. పోలీసులు, రోడ్డు ట్రాన్స్‌పోర్టు కమిషనర్స్, ఇతర సంబంధిత అధికారులు కలిసికట్టుగా కృషి చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అవకాశం ఉంటుంది. ఫలితంగా అమూల్యమైన మనుషుల, మూగజీవుల ప్రాణాలను కాపాడిన వారవుతారనడంలో సందేహం లేదు. రక్షణ చర్యల ద్వారా రోడ్డుప్రమాదాల బారిన పడిన బాధిత కుటుంబాలను రోడ్డున పడకుండా కాపాడిన వారవుతారు. ప్రమాదాలను నివారించడం ద్వారా సామాజిక అంశాంతిని, దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న భారాల్ని సైతం తగ్గించిన వారవుతారనడంలో సందేహం లేదు. రహదారుల్లో ప్రమాదకర ప్రాంతాల్లో స్పీడ్‌బ్రేకర్లు వేయడం, హెచ్చరికల మార్కులను ఏర్పాటు చేయడం, రహదారులపై ఏర్పాటు చేసిన మెర్క్యూరీ లైట్ల నిర్వహణ మానిటరింగ్ చేయడం, లాజిస్టిక్స్ వాహనాలకు ఇద్దరు డ్రైవర్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడం, వారి పనితీరును పరిశీలించడం, అధికారులు తనిఖీలను పెంచడం, రాష్ట్ర, జాతీయ రహదారుల సమీప ప్రాంతాల్లో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయకపోవడం, రోడ్డు ప్రమాదాల నివారణలో ముందంజలో ఉన్న రాష్ట్రాల నమూనాలను పరిశీలన, రాష్ట్రంలో అమలు చేయడం తదితర రక్షణ చర్యలను తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో అధికారులు, ధనిక, పేదలు అనే తేడా లేకుండా పలువురు రోడ్డు ప్రమాదాల రూపంలో కడతేరిపోయే అవకాశాలు ఉన్నాయనే సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



అక్రమ నిర్మాణాలను తొలగింపజేస్తున్న అధికారులు

జాతీయ రహదారి విస్తరణ పనులు

- 2.7 కిలోమీటర్లు.. రూ.8 కోట్లు

ప్రజాశక్తి - ముద్దనూరు

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా శనివారం నాలుగు రోడ్ల కూడలి నుంచి రోడ్డు ఆక్రమణకు గురైన కట్టడాలను అధికారులు జెసిబితో తొలగింపు చర్యలు చేపట్టారు. అంతకుముందు రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న భారీ చెట్లను తొలగించారు. జమ్మలమడుగు రహదారిలోని శివాలయం కూడలి నుంచి పులివెందుల రహదారిలోని బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్సేంజ్ కార్యాలయం సమీపంలో ఉన్న వంక వరకు 2.7కిలో మీటర్లు రూ.8కోట్లతో రోడ్డు పనులు చేయనున్నట్లు జాతీయ రహదారి ఎఇ విశ్వనాథ్ తెలిపారు. ముద్ద నూరు అభివృద్ధికి బాటలు పడుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీపేట పరీక్ష కేంద్రం తొలగింపు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని లక్ష్మీపేట ఉన్నత పాఠశాల గతంలో పదవ తరగతి పరీక్షా కేంద్రంగా ఉండేది. ఈ ఏడాది పాఠశాలను తొలగించి దాని స్థానంలో చాపాడులోని కస్తూరిబా బాలికల పాఠశాలను ఏర్పాటు చేశారు. గతంలో లక్ష్మీపేటలో ఒకటి, చాపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు పరీక్ష కేంద్రాలు నిర్వహించేవారు. ఈ ఏడాది కస్తూర్బా బాలికల పాఠశాలను, గూడూరు అప్పయ్యగారి జడ్పి ఉన్నత పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ రవిశంకర్ తెలిపారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో 115 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 247 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈనెల 17 నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలపై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

ప్రకృతి వ్యవసాయ పంటలపై ఫార్మర్ సైంటిస్ట్‌లకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న మెంటర్ రామాంజనేయులు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా 25 రకాల పంటలను పరీక్షించారు. పంటలలో కొన్ని మొక్కలను అబ్జర్వేషన్‌కు తీసుకున్నారు. వీటిలో మొక్క ఎత్తు, ఆకు వెడల్పు, కాయలు, పూలు కౌంట్ చేశారు. మొక్కలు ఉన్న దానికన్నా చాలా ఎత్తు పెరిగాయని, కాయల సైజు కూడా చాలా పెద్దవిగా కనిపించాయన్నారు. మొక్కల మధ్య పాలినేషన్ జరుగుతుందని, వాటి మధ్యలో తేనె పట్టులను గమనించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎంతో లబ్ధి చేకూరుతుందని వారికి వివరించారు.

రంగాపురంలో ఘనంగా జ్యోతుల ఉత్సవం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో జ్యోతుల ఉత్సవ కార్యక్రమాన్ని శనివారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కొలువై ఉన్న శ్రీచౌడేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఘనంగా పూజలు చేశారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. పరిసర గ్రామాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నీచ రాజకీయాలతో చంద్రబాబు కాలయాపన

- వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో చౌకబారు, నీచ రాజకీయాలతో కాలయాపన చేస్తున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్‌రెడ్డి విమర్శించారు. శనివారం సాయంత్రం వేంపల్లెలో ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ఒక సామాన్య వ్యక్తి నైనా రంగయ్య చనిపోతే ఆ వ్యక్తిని కూడా చిల్లర రాజకీయం కోసం 45 నిమిషాలుపాటు క్యాబినెట్ సమావేశంలో మాట్లాడావంటే నీస్థాయి ఎలాంటిదో ప్రజలందరికీ అర్థం అవుతుందన్నారు. వివేక హత్య కేసులో జగన్ సతీమణి భారతి, నారాయణ యాదవ్‌తోపాటు చనిపోయిన ఇసి గంగిరెడ్డి, అభిషేక్‌రెడ్డి పేర్లను చేర్చిన విష సంస్కృతి చంద్రబాబుది అన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకం పేరుతో మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎడాదికి ఒకటికి ఇచ్చే ఉచిత గ్యాస్ సిలిండర్‌లో కూడా 60 శాతం మందికి అందలేదని తెలిపారు. హామీలను అమలు చేయాలని, లేకపోతే సిఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

టిడిపిలో భగ్గుమన్న విభేదాలు

ప్రజాశక్తి - తొండూరు

తొండూరు మండల కేంద్రంలో టిడిపిలో రెండు గ్రూపుల మధ్య శనివారం విభేదాలు తలెత్తాయి. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి గ్రూపు ఇటీవల బిసి బాలురు వసతి గృహంలో కనీస వసతుల కల్పన కార్యక్రమం కింద పనులు ప్రారంభించారు. పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవీంద్రనాథ్ రెడ్డి గ్రూపు వ్యక్తులు పనులను అడ్డుకున్నారు. ఘర్షణ వాతావరణం నెలకొంది. పలువురు సీనియర్ నాయకులు సర్దిచెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి సంఘటనాస్థలం చేరుకుని సమస్యపై నాయకులతో చర్చించారు. పెద్ద సంఖ్యలో టిడిపి శ్రేణులు చేరుకోవడంతో పోలీసులు రంగం ప్రవేశం చేసి వారిని వెనక్కి పంపారు.



నాయకులతో మాట్లాడుతున్న ఉమాదేవి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మండలంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడప నడింపల్లెకు చెందిన గంల వెంకటసుబ్బయ్య (70) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు బేల్దారి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. వెంకటసుబ్బయ్య కడప నుండి రాయచోటి(జమలపల్లె) వైపునకు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా మండలంలోని ఊటుకూరు వద్ద రైల్వే బ్రిడ్జి సమీపంలోని శుభమ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా కుక్కను తప్పించబోయి అదుపు తప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొన్నాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గంప చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్టు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో ఎర్రబోయిన కళావతిని భర్త అనుమానంతో దారుణంగా కత్తితో దాడి చేసి పారిపోయిన సంఘటన తెలిసిందే. నిందుతుడు ఎర్రబోయిన భాస్కర్ సంఘటన అనంతరం పరారీలో ఉండగా శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ట్రైనీ డిఎస్‌పి భవాని, ఎస్ఐ చిన్న పెద్దయ్య దర్యాప్తులో భాగంగా గ్రామ పొలాల్లో ఉన్న భాస్కర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట మండలంలో ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ నాయకులు ఒక్కటైపోయారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ నాయకుల ఆదాయ వనరులుగా మారాయి. సామాన్యులకు ఏ చిన్న పని జరగాలన్నా నాయకుల ప్రమేయం లేకుండా పనులు జరగడం లేదని ప్రజల నుంచి తీవ్ర ఆరోపణలు వినిసిస్తున్నాయి. కార్యాలయానికి పనుల నిమిత్తం ఎప్పుడు వెళ్లినా అధికారులు నాయకులకు రాచ మర్యాదలు చేస్తూ సామాన్య ప్రజానీకాన్ని ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, నాయకులు ఒక్కటై ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాక, సహజ సంపదను ఆదాయ వనరుగా మార్చుకొని ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని కొందరు ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో ప్రధానమైన రెవెన్యూ అధికారులు నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కొమ్ము కాస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామంలో మట్టి అక్రమ రవాణా రాత్రి వేళల్లో జోరుగా యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వ అధికారుల అండదండలతోనే అక్రమ మట్టి రవాణా ఖాజీపేట మండలంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోందని, ప్రకృతిని ధ్వంసం చేస్తున్నారని ప్రతిపక్షాలు, ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్న ఎమ్మెల్యే మాటలు ఏమయ్యాయి అంటూ ప్రజలు ఆయనను ప్రశ్నిస్తున్నారు. ప్రజల పక్షాన నిలవాల్సిన అధికారులు నాయకులు చెప్పినట్లు వ్యవహరిస్తూ ప్రభుత్వానికి వ్యవస్థలకు చెడ్డపేరు తీసుకున్నారని మరికొందరు పేర్కొంటున్నారు. చెముళ్లపల్లె చెరువు నుంచి కూడా అక్రమ మట్టి రవాణా పెద్ద ఎత్తున జరుగుతోందని, జిల్లాస్థాయి అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారని, చెరువులను ధ్వంసం చేస్తున్నడం వల్ల తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాజీపేటలో మట్టి మాఫియాకు కీలకమైన ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సహకరిస్తూ వారికి కాసులు వర్షం కురిపిస్తుండడంతోపాటు తమ జేబులు నింపుకుంటున్నారని బహిరంగంగా ఆరోపిస్తున్నారు. నీటిపారుదల అధికారులు, మైన్స్, రెవెన్యూ అధికారులు, పోలీసులు ఎవరికి వారే యమునా తీరే అన్న విధంగా వ్యవహరిస్తూ ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శలున్నాయి. ఇసుక కూడా రాత్రి సమయాల్లో విచ్చలవిడిగా ఉచిత అనుమతుల పేరిట పెద్ద ఎత్తున తరలించక పోతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకొని ప్రకృతిని, ప్రజా సంపదను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



రాత్రి వేళ అక్రమంగా తరలిపోతున్న గ్రావెల్

మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి



యుటిఎఫ్ భవన్‌లో మాట్లాడుతున్న అపర్ణ

ప్రజాశక్తి కడప అర్బన్ :

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సిఐటియు అనుబంధం) మహిళా కమిటీ ఆధ్వర్యంలో శనివారం పాత మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రం హాజరయ్యారు. మహిళా కార్మికులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు సమాజంలో చాలా కీలకపాత్ర పోషించడంతోపాటు, కుటుంబాన్ని నడిపిస్తున్నారని కొనియాడారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ మహిళా కమిటీ సభ్యులు, మహిళలు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **యుటిఎఫ్ ఆధ్వర్యంలో..** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో యూటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు సుజాత రాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అపర్ణ, ప్రముఖ న్యాయవాది జయశ్రీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే లింగ వివక్షత ఉండదని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రూతు ఆరోగ్య మేరీ, కృష్ణారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, శివశంకర్ రెడ్డి ప్రధానోపాధ్యాయురాలు భాగ్యవతి, వీణా పల్లవి, మేరీ ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిమ్స్ డాక్టర్ రమాదేవి

ఆర్‌టిసి మహిళా ఉద్యోగులకు పురస్కారాలు.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్‌టిసి రీజనల్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ప్రజా రవాణా అధికారి గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జోనల్, జిల్లా స్థాయి మహిళా ఉద్యోగులకు పురస్కారాలు ప్రదానం చేశారు. జోనల్ స్థాయిలో లక్ష్మీదేవి, దీప్తి సృజన, లలితమ్మ, మాధవి, విశ్వకళాదేవి, స్వాతి, జిల్లా స్థాయిలో ఈశ్వరమ్మ, రంగమ్మ, లక్ష్మీదేవి, నాగలక్ష్మి, ప్రమీల, ప్రియా పురస్కారాలు అందుకున్నారు. **ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..** ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ఆధ్వర్యంలో రిమ్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.వి.రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనరసమ్మ, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ రాజేశ్వరి, ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ మాధురిలత, లాయర్ శివకామిని, ఫ్యాక్షన్ జోన్ ఎస్ఐ లక్ష్మీదేవి, అధ్యక్షులు రామ రంజిత, అసోసియేట్ ప్రెసిడెంట్ సుమలత, కార్యదర్శి గీత, కోశాధికారి ఆశ జ్యోతి, ఉపాధ్యక్షులు వెంకటలక్షుమ్మ, నాయకులు పాల్గొన్నారు. **ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో** మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భారతి, అనురాధ, కమలా, విజయకుమారి, శారద దేవి, నాగసుబ్బారెడ్డి, నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, బోస్ బాబు, రాము గౌడ్, బాల వెంకటేష్, మునయ్య, గంగిరెడ్డి, ఫాజల్, నరసింహ, రంనాథ్ పాల్గొన్నారు. **నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో** మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు, ఆరోగ్యకార్యకర్తలు, సమాజ సేవకులు పాల్గొన్నారు. **కెఎంఆర్ఎం కళాశాలలో..** అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకులుగా పనిచే స్తున్న డాక్టర్ జి. విజయ లక్ష్మి హాజరయ్యారు. కెఎల్ఎం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నమ్మ, కెఎస్ఆర్ఎం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్. ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ విఎస్ఎస్ మూర్తి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ఉమెన్ ఎంపవర్మెంట్, ఉమెన్ ప్రొటెక్షన్, జెండర్ ఈక్వాలిటీ, స్టూడెంట్ ఆక్టివిటీ కౌన్సిల్, ఉమెన్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో..

కడప : మహిళల అభివృద్ధి అంటేనే సమాజ పురోగతి అని మహిళా సాధికారిత సాధ్యమైనప్పుడే దేశాభివృద్ధి పూర్తిగా సాకారమవుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మేయర్ సురేష్ బాబు, వైసిపి మహిళ జిల్లా అధ్యక్షురాలు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ అన్నారు. శనివారం వైసిపి జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో గెలిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..** కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శ్యామల, నాగరత్నగౌడ్ ఆధ్వర్యంలో మహిళా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న విజయజ్యోతి

డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి హాజరయ్యి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. సిటీ అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పిసిసి (ఆసిఫ్ ఖాన్, కమల్ బాష, హమీద్ ఖాన్, రాహంతుల్లా ఖాన్, శీలం గంగయ్య, జహూర్ పాల్గొన్నారు. **బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..**అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను జిల్లా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షు లు తొ్రివేముల హాజరయ్యారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటైజర్ వర్కర్లుగా పనిచేస్తున్న మహి ళలను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జె. జయలక్ష్మి, ఎస్. భారతి, బి. గోవిందమ్మ, వెంకటలక్ష్మి, అమరావతి, చిన్నక్క, ఏ. వెంకటలక్ష్మి, గోవిందు నాగరాజు, కల్యా సుధాకర్, త్రివిక్రమ్ రావు పాల్గొన్నారు. **న్యాయ సేవా సదన్ భవన్‌లో..** మహిళలు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా అభివృద్ధి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్ లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వ రరావు, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దినబాబు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జ్ కే.ప్రత్యూష కుమారి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జిసి.ఆసిఫా సుల్తానా, ఎక్సైజ్ కోర్టు జడ్జ్ జె.హేమ స్రవంతి, మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం.ఆశాప్రియ, కడప బార్ అసోసియేషన్ బార్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మహిళలు, పారా లీగల్ వాలంటరీలు, పానెల్ న్యాయవాదులు, ప్రజలు పాల్గొన్నారు. **కాసినాయన :** బ్లెస్డ్ బ్రయాన్ అనాధాశ్రమంలో మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ హాజరయ్యారు. ముందుగా ఆమెను ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఆటల్లో పాల్గొని బహుమతులు గెలిచిన మహిళలందరికీ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహిళలు, ఆశ్రమ చిన్నారులు ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** దేశంలోని అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే దేశ పురోభివృద్ధి చెందుతుందని వికాస్ పాఠశాల వ్యవస్థాపకుడు నజీర్ బాషా తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక వికాస్ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబ వ్యవస్థ కూడా బాగుంటుందన్నారు. మహిళ తల్లిగా, చెల్లిగా, అక్కగా, కూతురిగా ప్రతిరోజు గౌరవించబడినప్పుడే మహిళా సాధికారికత సాధ్యమవుతుందని ఆకాంక్షించారు. పాఠశాల హెచ్ఎం రఫీయా, ఉపాధ్యాయులు పద్మ, అశ్వాన, అబీదాను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారిత సాధించడమే అంతర్జా తీయ మహిళా దినోత్సవం లక్ష్యమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శివ మునెమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలతను తులసిరెడ్డి, అలివేలమ్మ ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం, మండలశాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వేమా రాజా, బద్రినాథ్, రాజు, రమణ, మహబూబ్ బాషా, ఓబులేసు పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఎస్ఐ తులసి నాగప్రసాద్



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్ఐ తులసి నాగప్రసాద్

ఆధ్వర్యంలో శ్రీవివేకానంద స్కూల్, శ్రీ మేధా స్కూల్, కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో సింహాద్రిపురం బడ్డాయి పాలెం సర్కిల్ నుండి గురిజాల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళా సాధికారత, భద్రత మొదలగు అంశా లతో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, స్లోగన్ చేశారు. గురజాల సర్కిల్‌లో భారీ సంఖ్యలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. పోలీస్‌స్టేషన్ వద్ద వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. పోలీస్ సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రతి మహిళ ఉన్నత స్థాయికి ఎదగాలని ఇఒపిఆర్‌డి పద్మనాభ రెడ్డి సూచించారు. వెలుగు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా డ్వాక్రా మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం మంజునాథ పాల్గొన్నారు. **ముద్దనూరు :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయం పరిపాలనా అధికారి పరిపూర్ణ అరుంధతి విధుల్లో ఉత్తమ సేవలు అందించినందుకు ఉత్తమ ఉద్యోగిగా కడపలో కలెక్టర్‌చే అవార్డు అందుకున్నారు. ముద్దనూరు-1 అంగన్వాడీ కేంద్రం కార్యకర్త ఎల్.ప్రభావతి సేవలను గుర్తించి ఉత్తమ కార్యకర్తగా కడపలో ఐసిడిఎస్ పీడీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ సచివాలయంలో కార్యదర్శి లక్ష్మి నరసింహులు ఆధ్వర్యంలో సర్పంచ్ బోనం సరళను మహిళా పోలీసులు ఆకాంక్ష, శివజ్యోతి పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెలుగు సిసిలు ఇబ్రహీం, రామాంజనేయరెడ్డి, విఒలు, మహిళలు పాల్గొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో సిఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్ ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుళ్లు వాణి, యశోద, మహిళా పోలీసులు శివజ్యోతి, ఆకాంక్ష, మార్తమ్మ కేక్ కట్ చేశారు.



సర్పంచ్ సరళను సన్మానిస్తున్న మహిళా ఉద్యోగులు

చాపాడు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న మహిళ వైద్యులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. వైద్యరంగంలో ఎక్కువ భాగం మహిళలే ఉండడం సంతోషించదగ్గ విషయమన్నారు. నిర్వహించిన పలుపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా డాక్టర్లు శ్రీవాణి, కావ్య మాధురి, ఫార్మసిస్ట్ సుభాషిణి, ఎంఎల్‌హెచ్‌పీ అంజుమన్, ఏఎన్ఎం హేమలత, ఆశా మాధవిని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఓబులేష్, సిహెచ్ఓ మహదేవ్ యాదవ్, పిహెచ్ఎన్ సుకన్య, సూపర్వైజర్ సరస్వతి, బాబుల్‌రెడ్డి, భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి, సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



మహిళా వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న సిబ్బంది



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఉపాధి ఎపిఒ జగదీశ్వర్‌రెడ్డి

ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

భూగర్భ జలాల సంరక్షణలో భాగంగా గ్రామాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా చర్యలు చేపడుతున్నట్లు ఎపిఒ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో గృహ అవసరాలకు వినియోగించిన నీరు, వర్షపు నీరు ఇంటి పరిసరాల్లో నిలువ ఉంటూ రోగాల బారిన పడడాన్ని నివారించడానికి ప్రభుత్వం ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి పంచాయతీకి 10 చొప్పున ఇంకుడు గుంతల ఏర్పాటుకు అవకాశం కల్పించిందని తెలిపారు. మార్చి చివరి నాటికి ప్రతి గ్రామంలో లక్ష్యం పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మండల పరిధిలో 22 గ్రామ పంచాయతీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధి కింద ఒక్కో ఇంకుడు గుంతకు రూ.6వేలు వస్తుందన్నారు. కూలీల వేతనం ద్వారా రూ.500, నిర్మాణ సామగ్రికి రూ.5,500 మంజూరవుతుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. సిద్ధారెడ్డిపల్లె పంచాయతీలోని ద్వారక నగరం గ్రామంలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతను శనివారం ఎపిఒ పరి శీలించారు. నాలుగు అడుగుల లోతు వెడల్పుతో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసి, దానిలో గులకరాళ్లతో నింపాల్సి ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించారు.

న్యాయవాదుల సంఘ అధ్యక్షుడిగా తులసీరామ్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



పులివెందుల న్యాయవాదుల సంఘ అధ్యక్షుడిగా వి.తులసిరామ్‌ను శనివారం న్యాయవాదులు ఏకగ్రీవంగా శనివారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎ.ప్రతాపరెడ్డి, జనరల్ సెక్రెటరీగా వి.కిషోర్ కుమార్‌రెడ్డి, కోశాధికారిగా ఎన్. లక్ష్మీ నరసింహులు, జాయింట్ సెక్రెటరీగా ఎస్.శశిరేఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. ఏకగ్రీవంగా నియమితులన వారికి పలువురు న్యాయవాదులు, ప్రజా పతినిధులు అభినందనలు తెలిపారు.

వనిపెంట నుంచి నేషనల్ హైవే ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు మండలం వనిపెంట గ్రామం మీదుగా అభివృద్ధి దిశగా వెళుతున్న నేషనల్ హైవేను వనిపెంట గ్రామంలోనే ఏర్పాటు చేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం ఆయన ప్రజలతో కలిసి మాట్లాడుతూ గ్రామ సమీపాన శ్మశానాల మీదుగా, గోడేరు వంకపై ప్రమాదకర బైపాస్ రహదారిగా కాకుండా వనిపెంట గ్రామంలో నుంచే తీసుకెళ్లాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, నేషనల్ హైవే అధికారులను కోరారు. మైదుకూరు నుండి పోరుమామిళ్ల వరకు అన్ని గ్రామాల్లోనే రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు. వనిపెంట గ్రామంలో రోడ్డుకు సరిపడా 90 శాతం స్థలం ప్రభుత్వానిది ఉన్నా, బైపాస్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి దశలవారీ నిరసన కార్యక్రమాల్లో భాగంగా తొలి విడతగా గ్రామ బయట రహదారి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ రాతపూర్వక వినతితో గ్రామ రైతులు, ప్రజలతో సంతకాల సేకరణ సేకరించారు. వినతిని సోమవారం కడపలోని నేషనల్ హైవే జిల్లా ప్రధాన అధికారికి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవాసమితి మైదు కూరు నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, జిల్లా సమితి సభ్యులు మూలే రామాంజనేయరెడ్డి, గ్రామ రైతులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కటారు వీరన్న, భూమిరెడ్డి శ్రీనివాసులు, కారంశెట్టి శివ, దేవతి గోవింద రాజులు, ఫరీదాబాయిగారి ఇస్మాయిల్, మునగా దిలీప్, మురికి రాము, కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



వీడ్కోలు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - తొండూరు

తొండూరు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఉదయం సరస్వతీ పూజ, మధ్యాహ్నం ఉపాధ్యాయుల విలువైన ప్రసంగాలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో వీడ్కోలు వేడుక ఆనందంగా సాగింది. విద్యార్థులు పాఠశాలకు రూ.15,000 విలువైన ప్రధానోపాధ్యాయుల టేబుల్‌ను వితరణ చేశారు.

రూ.163 కోట్ల పథకంలో రూ.700 కోట్ల అవినీతి సాధ్యమా? : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రూ.163కోట్లతో ప్రారంభించిన జగనన్న ఇళ్ల పథకంలో రూ.700కోట్ల అవినీతి సాధ్యమా అని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి జగనన్న ఇళ్ల కాలనీలో తాను రూ.700 కోట్ల అవినీతికి పాల్పడ్డామని చేసిన ఆరోపణలపై రాచమల్లు శనివారం స్పందించారు. తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో పేదల ఇళ్ల నిర్మాణానికి జగన్ హయాంలో 476 ఎకరాల 6సెంట్ల భూమిని రైతుల వద్ద నుండి కొన్నామన్నారు. ఇందుకు రూ.163కోట్లు వెచ్చించామన్నారు. మూడు చోట్ల కొన్న భూమిని పైసలతో సహా వివరించారు. ఇందులో తాను రూ.700 కోట్లు కొట్టేసానని వరద ఆరోపించారన్నారు. ఇది ఆయన అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. ఈ వ్యవహారంలో కూటమి ప్రభుత్వం విజిలెన్స్‌తో విచా రణ చేయించినప్పటికీ తాను అవినీతికి పాల్పడినట్లుగా నిరూపితం కాలేదన్నారు. తన నిజాయితీని వరద జీర్ణించుకోలేక ఉన్నాడని తన అహాన్ని చల్లబరుచుకోవడానికి అసెంబ్లీ వేదికగా అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. తనపై ఎన్నిసార్లయినా విచారణ చేసు కోవచ్చున్నారు. ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. తాను అప్పుల్లో ఉండడమే జగన్ స్వచ్ఛమైన పాలనకు నిదర్శనమన్నారు. ధర్మంగా ఉండడం ఇతరులకు సహాయపడడం తన బలమని రాచమల్లు పేర్కొన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.